# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ గురువారం 09 అక్టోబర్ 2025 | www.balagamtv.com | పేజీలు 4


## మరో రెండు దగ్గు మందులపై నిషేధం

- పిల్లల ప్రాణాలకు ముప్పుగా మారిన సిరప్‌లపై తెలంగాణ ప్రభుత్వ కీలక నిర్ణయం

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

పిల్లలకు ప్రమాదకరంగా మారిన దగ్గు మందులపై తెలంగాణ ప్రభుత్వం మరోసారి కఠిన చర్యలు తీసుకుంది. ఇప్పటికే 'కోల్డ్ రిఫ్' సిరప్‌పై నిషేధం విధించిన ప్రభుత్వం, తాజాగా 'రిలీఫ్', 'రెస్పి ఫ్రెస్–టీఆర్' సిరప్‌ల విక్రయాలపై కూడా నిషేధం ప్రకటించింది. ఔషధ నియంత్రణ విభాగం ప్రకటన ప్రకారం, ఈ రెండు మందుల్లో కల్తీ పదార్థాలు ఉన్నట్లు తేలడంతో, వాటి ఉత్పత్తి, పంపిణీ, విక్రయాలను వెంటనే నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేసింది. ప్రజారోగ్య విభాగం ఇప్పటికే తల్లిదండ్రులకు పలు సూచనలు చేసింది. "పిల్లల్లో సాధారణ దగ్గు, జలుబు వచ్చినప్పుడు వెంటనే మందులు వాడకండి. తగిన నివారణ చర్యలతో కట్టడి చేయవచ్చు," అని సూచించింది. ఇక రెండేళ్లలోపు పిల్లలకు దగ్గు మందు ఇవ్వకూడదని, ఐదేళ్లలోపు చిన్నారులకు అత్యవసరమైతే మాత్రమే మందులు వాడాలని వైద్య అధికారులు హెచ్చరించారు. "అనవసరంగా మందులు వాడితే చిన్నారుల ప్రాణాలకు ప్రమాదం కలుగుతుంది," అని ప్రజారోగ్య విభాగం స్పష్టం చేసింది. "తదుపరి దశలో ల్యాబ్ టెస్టులు నిర్వహించి, ఈ సిరప్‌ల ఉత్పత్తి యూనిట్లపై చర్యలు తీసుకుంటాం. ప్రజల ఆరోగ్య భద్రతే మా ప్రాధాన్యం," అని పేర్కొన్నారు.

## నేడు తొలివిడత నోటిఫికేషన్

- 292 జెడ్పీటీసీ, 2963 ఎంపీటీసీలకు ఎన్నికలు
- నామినేషన్ల స్వీకరణకు మూడు రోజులు గడువు
- 23న పోలింగ్



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

జెడ్పీటీసీ, ఎంపిటిసి ఎన్నికల ప్రక్రియ గురువారం(అక్టోబర్ 9) ప్రారంభం కానుంది. తొలి విడత జెడ్పీటీసీ, ఎంపిటిసి ఎన్నికలకు గురువారం రిటర్నింగ్ అధికారులు నోటీసులు జారీ చేయనున్నారు. ఉదయం 10.30 నుంచి జెడ్పీటీసీ, ఎంపిటిసి ఎన్నికల నామినేషన్‌లు స్వీకరిస్తారు. మొదటి విడత నామినేషన్లు ఈ నెల 11 వరకూ స్వీకరిస్తారు. మొదటి విడతలో 292 జడ్పిటిసి, 2,963 ఎంపిటిసిల స్థానాలకు ఎన్నికలు జరుగుతాయి.

### 292 జెడ్పీటీసీ, 2963 ఎంపీటీసీలకు ఎన్నికలు

తొలి విడతతో 53 రెవెన్యూ డివిజన్ల పరిధిలోని 292 జెడ్పీటీసీ, 2,963 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయి. నోటిఫికేషన్‌లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కేటాయిస్తారని ఎస్ఈసీ ఇప్పటికే ప్రకటించింది. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం–2018 రూల్ 5 ప్రకారం ఎంపీపీ, జెడ్పీల వారీగా రిటర్నింగ్ అధికారులు నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. నోటిఫికేషన్ వెలువడిన అనంతరం అన్ని జిల్లాల్లో రిటర్నింగ్ అధికారులు ఈ నెల 11వ తేదీ వరకు ఉదయం 10:30 గంటల నుంచి నామినేషన్లు స్వీకరిస్తారు. 12వ తేదీ నామినేషన్ల పరిశీలన ఉంటుంది. అదే రోజు సాయంత్రం ఐదు గంటలకు అర్హత నామినేషన్లను ధ్రువీకరించి ప్రాథమిక జాబితా విడుదల చేస్తారు. అనర్హతకు గురైన వారి నామినేషన్లపై అప్పీళ్లను 13వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు స్వీకరిస్తారు. 14న వాటిని మరోసారి పరిశీలిస్తారు. 15వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ గడువు ఉంటుంది. అనంతరం పోటీలో ఉండే అభ్యర్థుల జాబితాను రిటర్నింగ్ అధికారి ప్రకటిస్తారు. ఈ నెల 23వ తేదీ ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. 5 గంటల వరకు లైన్‌లో ఉన్నవారందరికీ ఓటు వేసే అవకాశం కల్పిస్తారు. సాంకేతిక, రాజకీయ, ఇతర కారణాలతో అనివార్యంగా పోలింగ్ అగిపోయినా, అభ్యంతరాలు వ్యక్తమైనా ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల వారీగా రాష్ట్ర ఎన్నికల సంఘం పరిశీలించి రీ పోలింగ్‌పై నిర్ణయం తీసుకుంటుంది. నవంబర్ 11వ తేదీ ఓట్ల లెక్కింపు జరుగుతుంది. అదే రోజు ఎన్నికల అధికారులు విజేతలను ప్రకటిస్తారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉన్న విషయం తెలిసిందే. గురువారం కూడా దీనిపై వాదనలు జరగనున్నాయి. ఇంప్లీడ్ పిటీషన్లు పెరుగుతున్నాయి. మరోవైపు 2011 జనాభా లెక్కల ప్రకారం కాకుండా 2024 కులగణన సర్వే డేటా ప్రకారం తమకూ ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు పెంచాలనే పిటిషన్లు దాఖలు కావడం వంటి తాజా పరిణామాలతో కోర్టు తీర్పు మరింత ఆలస్యమయ్యే అవకాశముందనే చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదలపై సస్పెన్స్ కొనసాగుతోంది. అయితే తొలి విడత నోటిఫికేషన్ విడుదలపై హైకోర్టు ఎలాంటి అభ్యంతరాలు చెప్పని విషయం గమనార్హం. గురువారం హైకోర్టులో వాదనల తర్వాత తీర్పు ఇస్తారా..రిజర్వు చేస్తారా అనేదానిపైనా చర్చలు జరుగుతున్నాయి.

మిగితా 2వ పేజీలో

## స్థానిక ఎన్నికలపై స్టేకు నిరాకరణ

- హైకోర్టులో పిటిషనర్లు, ప్రభుత్వ లాయర్ల మధ్య వాడీవేడిగా వాదనలు
- రిజర్వేషన్లు 50 శాతం దాటడం రాజ్యాంగ విరుద్ధమన్న పిటిషనర్
- సమగ్ర అధ్యయనం తర్వాతే బిల్లు తీసుకువచ్చామన్న ప్రభుత్వం
- కేసులో 30 ఇంప్లీడ్ పిటిషన్లు దాఖలు
- నేడు మధ్యాహ్నం తదుపరి వాదనలు వింటామన్న హైకోర్టు




బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో 42 శాతం బిసి రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన జీవోను రద్దు చేయాలని రెడ్డి సామాజిక వర్గానికి చెందిన ఇద్దరు వ్యక్తులు హైకోర్టులో పిటిషన్ వేయగా.. బుధవారం విచారణ జరిగింది. పిటిషనర్ల తరఫు న్యాయవాది, అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి కోర్టులో సుదీర్ఘ వాదనలు వినిపించారు. 42 శాతం రిజర్వేషన్లకు శాస్త్రీయ ఆధారాలు చూపలేదని పిటిషనర్ల తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. బిసి కులగణన చేశారు కానీ.. దానిని బహిర్గతం చేయలేని అన్నారు. 2018లో 34 శాతం బిసి రిజర్వేషన్లను ఇదే కోర్టు కొట్టివేసిందని గుర్తు చేశారు. రాజ్యాంగబద్ధంగా ఎన్నికల నిర్వహణకు మేం వ్యతిరేకం కాదని పేర్కొన్నారు. మరోవైపు గురువారం మరిన్ని వాదనలు వినిపిస్తామని అడ్వకేట్ జనరల్ కోర్టుకు తెలిపారు. అయితే గురువారం స్థానిక సంస్థల ఎన్నికలపై నోటిఫికేషన్ ఇవ్వకుండా చూడాలన్న పిటిషనర్ తరుపు న్యాయవాది కోరగా.. హైకోర్టు పట్టించుకోలేదు. ఇరు వర్గాల వాదనలు విన్న అనంతరం విచారణను రేపటికి వాయిదా వేస్తున్నట్లు హైకోర్టు వెల్లడించింది. గురువారం మధ్యాహ్నం 2.15 గంటలకు హైకోర్టు విచారణ చేపట్టనుంది.

బీసీ రిజర్వేషన్లకు అనుకూలంగా తమ వాదనలు కూడా వినాలంటూ కాంగ్రెస్, సీపీఐ సహా మరి కొందరు బీసీ నాయకులు 30 ఇంప్లీడ్ పిటిషన్లు దాఖలు చేశారు. వీటన్నింటిపై చీఫ్ జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ జీఎం మోహియుద్దీన్ డివిజన్ బెంచ్ బుధవారం సుదీర్ఘంగా విచారణ జరిపింది. తొలుత పలువురు లాయర్లు ఒకేసారి వాదనలకు సిద్ధమవడంతో హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. బీసీ రిజర్వేషన్లు సీరియస్ అంశమనీ, తమ సహనాన్ని పరీక్షించొద్దని హితవు చెప్పింది.

తర్వాత పిటిషనర్ల తరపున సీనియర్ లాయర్లు కే వివేక్‌రెడ్డి, బీ మయూర్‌రెడ్డి, జె ప్రభాకర్ తదితరులు వాదనలు ప్రారంభించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదన్నారు. బీసీ రిజర్వేషన్లను 25 శాతం నుంచి 42 శాతానికి పెంపు చేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. డెడికేటెడ్ కమిషన్ చేసిన సిఫార్సులకు అనుగుణంగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చట్ట వ్యతిరేకమన్నారు. అశాస్త్రీయ గణాంకాలతో 50 శాతం దాటిన రిజర్వేషన్ల నిర్ణయాన్ని రద్దు చేయాలని కోరారు. రిజర్వేషన్లకు సంబంధించి సుప్రీం కోర్టు మూడు వేర్వేరు కీలక కేసుల్లో వెలువరించిన ఉత్తర్వులకు వ్యతిరేకంగా ప్రభుత్వ చర్యలు ఉన్నాయన్నారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదని సుప్రీం కోర్టు చెప్పిందన్నారు. ఇందుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం చట్టం కూడా చేసిందన్నారు. దీనిని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం సవరణ చేయడంతో ఈ వివాదం వచ్చిందన్నారు. షెడ్యూల్ ప్రాంతాల్లోని ఎస్టీలకు మేలు జరిగేలా రిజర్వేషన్లు 50 శాతానికి పెంచొచ్చని సుప్రీంకోర్టు చెప్పిందన్నారు. ఈ మేరకు కృష్ణమూర్తి అండ్ అదర్స్ వర్సెస్ ఇండియా కేసులో తీర్పు చెప్పిందన్నారు. మరాఠా రిజర్వేషన్ల అంశంలోనూ 50 శాతం దాటిన రిజర్వేషన్లను సుప్రీంకోర్టు కొట్టేసిందన్నారు. రాష్ట్రంలో ఎస్టీలు మాత్రమే ఉన్న ప్రాంతాలు లేవనీ, సుప్రీం కోర్టు తీర్పుల ప్రకారం రాష్ట్రంలో రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల పెంపు వల్ల మొత్తం రిజర్వేషన్లు 67 శాతానికి పెరుగుతాయనీ, ఇది రాజ్యాంగ వ్యతిరేకమని పిటీషనర్ల తరపు న్యాయవాదులు చెప్పారు.

అసెంబ్లీ ఆమోదించిన బిల్లుకు గవర్నర్ ఆమోదం చెప్పలేదని, చట్టం కాకుండా ప్రభుత్వం జీవో 9 జారీ చేసిందని చెప్పారు. రిజర్వేషన్ల పెంపు, పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లులు గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. పంచాయతీరాజ్ శాఖ చట్ట నిబంధనలను ఉల్లంఘిస్తూ జీవో ఇచ్చిందన్నారు. ఆ శాఖ జారీ చేసిన జీవో 41ని కొట్టివేయాలని కోరారు. రిజర్వేషన్లను ఏకంగా 67 శాతానికి పెంచడం చెల్లదన్నారు. ఇప్పుడున్న చట్ట నిబంధల ప్రకారం, సుప్రీంకోర్టు తీర్పుల మేరకు పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలన్నారు. ఇందిరా సాహ్నీ కృష్ణమూర్తి, వికాశ్‌కిషన్ గవాయ్ కేసుల్లో సుప్రీంకోర్టు తీర్పులు శిరోధార్యమన్నారు. బీసీ రిజర్వేషన్లను ఏబీసీడీలుగా వర్గీకరించాలంటూ దాఖలైన పిటిషనర్ తరఫు న్యాయవాది వాదిస్తూ, అనంతరామన్ కమిషన్ నివేదికను ప్రభుత్వం విస్మరించిందన్నారు. మున్నూరు కాపు, ముదిరాజ్, యాదవ, గౌడ్‌లకే స్థానిక సంస్థల్లో రాజకీయ అధికారం లభిస్తోందన్నారు. పేదలుగా ఉన్న బీసీలు అలాగే ఉంటున్నారని చెప్పారు.

ప్రభుత్వం తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ, అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి హాజరయ్యారు. తొలుగ సింఘ్వీ వాదనలు వినిపిస్తూ, రాష్ట్ర శాసనసభ బిల్లును ఆమోదించి గవర్నర్‌కు గత మార్చిలో పంపితే ఇప్పటి వరకు ఆమోదం చెప్పలేదన్నారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం ప్రజల కోసం పనిచేస్తుందనీ, ఈ క్రమంలోనే స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనకు జీవో వెలువడిందని చెప్పారు. గవర్నర్ తన అధికారాలను వినియోగించి బిల్లుకు ఆమోదం చెప్పడమో లేదా బిల్లును ప్రభుత్వానికి తిరిగి పంపడమో చేయాలని గుర్తు చేశారు. ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీ అనీ, గవర్నర్ నియామకం ద్వారా అధికారంలో ఉంటారని చెప్పారు. బీసీ జనాభా పెరిగిన నేపథ్యంలో వారికి న్యాయం చేయాలనే కోణంలోనే ప్రభుత్వం ఐఏఎస్ అధికారి నేతృత్వంలో డెడికేటెడ్ కమిషన్‌ను నియమించిందని చెప్పారు. ఇంటింటికీ సర్వే చేసి జనంలో ఉన్న పరిస్థితులను బేరీజు వేసి కమిషన్ శాస్త్రీయంగా నివేదిక ఇచ్చిందన్నారు. బీసీ జనాభా 56 శాతానికిపైగా ఉందనీ, బీసీలకు 42 శాతం

మిగితా 2వ పేజీలో

## 'స్వదేశీ'ని స్వీకరించాలి

- ప్రధాని నరేంద్ర మోదీ



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

'స్వదేశీ'ని స్వీకరించి, దేశ ఆర్థికవ్యవస్థను బలోపేతం చేయాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. బుధవారం నవీ ముంబైలో అంతర్జాతీయ విమానాశ్రయం మొదటి దశను ప్రారంభించిన అనంతరం ఆయన ప్రసంగించారు. స్వదేశీ వస్తువుల వాడకంవల్ల దేశంలో అభివృద్ధి వేగవంతం కావడమే కాకుండా యువతకు మరిన్ని ఉద్యోగావకాశాలు లభిస్తాయని అన్నారు. దేశంలోని ప్రతి ఒక్కరూ గర్వంగా 'స్వదేశీ' అని చెప్పాలని, ఇది ప్రతి పౌరుడికి, మార్కెట్‌కు ఒక మంత్రంలా మారాలని, ప్రజలు దేశీయ వస్తువులను కొనుగోలు చేసి, వాటినే బహుమతులుగా ఇస్తే ఆ డబ్బు తిరిగి మన ఆర్థిక వ్యవస్థకే చేరుతుందని ప్రధాని చెప్పారు. తద్వారా వృద్ధి, ఉపాధి పెరుగుతాయని చెప్పారు. జీఎస్టీ సంస్కరణలవల్ల దేశానికి, ప్రజలకు ఎంతో మేలు జరిగిందని, ఇటీవల ముగిసిన నవరాత్రుల్లో అమ్మకాలు భారీగా జరగడమే ఇందుకు నిదర్శనమని అన్నారు.

ఈ సందర్భంగా ప్రధాని మోదీ గత యూపీఏ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. 2008 ముంబై ఉగ్రదాడుల తర్వాత పాకిస్థాన్‌పై ఎందుకు దాడి చేయలేదని, ఎవరి ఒత్తిడితో ఆనాటి ప్రభుత్వం ఆ నిర్ణయం తీసుకుందో దేశం తెలుసుకోవాలనుకుంటోందని అన్నారు. కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వ బలహీన విధానాల వల్లే ఉగ్రవాదులు రెచ్చిపోయారని, దేశ భద్రత బలహీనపడిందని ఆరోపించారు. తమ ప్రభుత్వానికి మాత్రం దేశభద్రతే అత్యంత ప్రధానమని, ఆపరేషన్ సిందూర్ ద్వారా పాకిస్థాన్‌కు గట్టి సమాధానం ఇచ్చామని గుర్తుచేశారు.

## జిల్లాల్లో కేంద్ర బృందం పర్యటన



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

సెప్టెంబర్‌లో కురిసిన భారీ వర్షాలకు మెదక్, కామారెడ్డి జిల్లాల్లో జరిగిన నష్టాన్ని అంచనా వేసేం దుకు కేంద్ర బృందం బుధవారం ఆయా జిల్లాల్లో పర్యటించింది. మెదక్ జిల్లా నిజాంపేట, హవేలి ఘనపూర్ మండలాల్లో కేంద్ర బృందం పర్యటించి జరిగిన నష్టాన్ని అంచనా వేశారు. హవేలీ ఘనపూర్ పెద్ద చెరువు కట్ట, లింగాసాన్ పల్లి గ్రామంలో రోడ్డు, మెదక్ మండలంలోని మక్తభూపతిపూర్, తిమ్మానగర్ లో తెగిపోయిన రోడ్లను, కుంగిన బ్రిడ్జిలను పరిశీలిం చింది. అనంతరం నిజాంపేట మండలం నందిగామ గ్రామ శివారులో 765 డీజీ రోడ్డుపై కుంగిన బ్రిడ్జి, నస్కల్ రోడ్డులో తెగిన బ్రిడ్జిలను పరిశీలించారు. కుంగిన బ్రిడ్జిల వద్ద కాంట్రాక్టర్లు వరద ఉధృతిని ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి కేంద్ర బృందానికి వివరిం చారు. నస్కల్ వెళ్లడానికి మల్కా చెరువు మత్తడి బ్రిడ్జి అతి ప్రాధాన్య సంతరించుకుందని తెలిపారు. రైస్ మిల్లులు, పౌల్ట్రీ ఫారాలు ఉన్నందున వ్యాపార లావా దేవీలకు చాలా ఇబ్బంది అవుతుందని బ్రిడ్జిని తొందర గా నిర్మించే విధంగా ప్రభుత్వం తగు చర్యలు చేపట్టా లని కేంద్ర బృందానికి పలువురు తెలిపారు. స్పందిం చిన కేంద్ర బృందం.. బ్రిడ్జి పనులు ప్రారంభించేలా అధికారులకు సూచిస్తామని తెలిపారు. భారీ వర్షాల కారణంగా కలిగిన నష్టాలను అంచనా వేయనున్నా మన్నారు. పర్యటనలో కేంద్ర బృంద సభ్యులు కేంద్రం బృంద సభ్యులు డాక్టర్ కే. పొన్ను స్వామి, వినోద్ కుమార్, అభిషేక్ కుమార్‌తోపాటు మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్, ఆర్డీవో రమాదేవి, తహసీల్దార్ శ్రీనివాస్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఇమాద్, ఆర్అండ్‌బీ అధికారులు, ఎన్‌హెచ్ఏ అధికారులు ఉన్నారు.

కామారెడ్డి జిల్లాలో ఆగస్టు నెలలో సంభవించిన అధిక వర్షాల వల్ల జరిగిన నష్టాన్ని పరిశీలించేందుకు కేంద్ర బృందం సభ్యులు పర్యటించారు. ఆయా గ్రామాల్లో ధ్వంసమైన రోడ్లతో పాటు పంటపొలాల ను పరిశీలిస్తూ వివరాలు ఆరా తీశారు. కాగా ఆగస్టు లో వర్షాలు కురిసి నష్టాలు సంభవిస్తే.. అక్టోబర్‌లో పర్యటించడం పట్ల విమర్శలు వ్యక్తమయ్యాయి. కాగా, జిల్లాలోని భిక్కనూర్ మండల కేంద్రంలోని దెబ్బతిన్న దాస్నమ్మకుంటను పరిశీలించి, అంతంపల్లి రోడ్డులో దెబ్బతిన్న పంచాయతీ రోడ్డు, గ్రామంలో దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించారు. అనం తరం దెబ్బతిన్న బీబీపేట్ ఆర్ అండ్ బీ బ్రిడ్జిని పరిశీ లించారు. అనంతరం

మిగితా 2వ పేజీలో



## ఛత్తీస్‌గఢ్ పవర్‌ప్లాంట్‌లో ప్రమాదం

- లిఫ్ట్ కూలి నలుగురు మృతి.. ఆరుగురికి గాయాలు

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

ఛత్తీస్‌గఢ్ శక్తి జిల్లాలోని పవర్‌ప్లాంట్‌లో లిఫ్ట్ కూలి నలుగురు మృతి చెందారు. ఆరుగురికి గాయాలయ్యాయి. వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్టు శక్తి సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అంకిత శర్మ తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఉచ్పిండా గ్రామంలోని దబ్రా ప్రాంతంలోగల ఆర్‌కేఎం పవర్‌జెన్ ప్రయివేట్ లిమిటెడ్ ప్లాంట్‌లో మంగళవారం రాత్రి పదిమంది లిఫ్ట్ ఎక్కారు. నలభై అడుగుల ఎత్తులో ఉన్న సమయంలో లిఫ్ట్ ఒక్కసారిగా కూలిపోయింది. ఈ ఘటనలో గాయపడిన వారిని హుటాహుటిన రాయ్‌గఢ్ జిల్లాలోని జిందాల్ ఫోర్టిస్ ఆస్పత్రికి తరలించారు. వీరిలో నలుగురు బుధవారం ఉదయం చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందారు. మిగతా ఆరుగురు చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఆ లిఫ్ట్ సామర్థ్యం దాదాపు 2 వేల కేజీలు. దాని నిర్వహణ పనులు ఇటీవలే జరిగాయి. అయితే ఈ ప్రమాదం నిర్లక్ష్యం వల్లే జరిగిందా లేదా అనే కోణంలో తెలుసుకోవడానికి ఒక పారిశ్రామిక ఇన్‌స్పెక్టర్‌ను కూడా పిలిచినట్టు ఎస్పీ అంకిత శర్మ తెలిపారు.కాగా, ఛత్తీస్‌గఢ్‌లో కేవలం పదిహేనురోజుల్లోనే మరో ప్రమాదం చోటు చేసుకోవడం గమనార్హం. సెప్టెంబర్ 26న గోదావరి పవర్ అండ్ ఇస్పాత్ లిమిటెడ్ ఆవరణలో ఓ నిర్మాణ భవనం కూలిపోయింది. ఈ ప్రమాదంలో ఆరుగురు మృతి చెందారు. పలువురు గాయపడ్డారు.

## మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు క్షమాపణలు



- మంత్రి పొన్నం ప్రభాకర్

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

: సామాజిక న్యాయానికి ఛాంపియన్ కాంగ్రెస్ పార్టీ అని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ లో పుట్టి పెరిగానని, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కు, తనకు మధ్య ఎటువంటి దురుద్దేశం లేదని, మాకు పార్టీ సంక్షేమం గురించే ఆలోచన చేస్తున్నామని స్పష్టం చేశారు. తాను ఆ మాట అనకపోయినా పత్రికల్లో వచ్చిన దాని ప్రకారం ఆయన బాధ పడిన దానికి తాను క్షమాపణలు కోరుతున్నానన్నారు. తనకు అలాంటి ఆలోచన లేదని, తాను ఆ ఒరవడి లో పెరగలేదని, కాంగ్రెస్ పార్టీ తనకు ఆ సంస్కృతి నేర్పలేదన్నారు. సామాజిక న్యాయానికి పోరాడే సందర్భంలో వ్యక్తిగత అంశాలు పక్కన ఉంచామని, సామాజిక న్యాయంలో బలహీనవర్గాల బిడ్డగా ఇవాళ సిఎం రేవంత్ రెడ్డి, పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వంలో రాహుల్ గాంధీ సూచన మేరకు 42 శాతం రిజర్వేషన్ల కోసం పోరాటం చేస్తున్నామన్నారు. తామంతా ఐక్యంగా భవిష్యత్ లో కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయం కోసం పని చేస్తామని స్పష్టం చేశారు. లక్ష్మణ్ కు వ్యక్తిగతంగా క్షమాపణలు చెబుతున్నానని, కరీంనగర్ లో మాదిగ సామాజిక వర్గంతో తాను కలిసి పెరిగానని, ఆ అపోహ ఉండవద్దని విజ్ఞప్తి చేస్తున్నానన్నారు.

## సంక్షేమ గురుకులాలకు తాళాలు వేసే దుస్థితి దుర్మార్గం



- గురుకులాల అద్దె బకాయిలు చెల్లించక పోవడం సీఎం రేవంత్ రెడ్డి అసమర్థతకు నిదర్శనం..
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

బలగం టీవీ, హైదరాబాద్

యావత్ దేశానికే తలమానికంగా నిలిచిన తెలంగాణ సంక్షేమ గురుకులాలకు అద్దె బకాయిలు పేరుకుపోయి, చివరికి భవనాలకు తాళాలు వేసే దుస్థితి రావడం అత్యంత దుర్మార్గమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. గురుకులాల నిర్వహణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, దీనికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసమర్థత, చేతకానితనానికి నిదర్శనమని మండిపడ్డారు.

విద్యాశాఖను తన వద్దే పెట్టుకున్న ముఖ్యమంత్రి, గురుకుల భవనాలకు ఏకంగా ఏడాది కాలం నుంచి అద్దె బకాయిలు చెల్లించకపోవడాన్ని కేటీఆర్ తప్పుబట్టారు. పేద విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపిన ఈ అత్యుత్తమ వ్యవస్థను కుప్పకూల్చి, కేసీఆర్ గారి ఆనవాళ్లు చెరిపేయాలన్న కుట్రలో భాగంగానే సీఎం రేవంత్ ఇదంతా చేస్తున్నట్టు అనుమానం కలుగుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఓవైపు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా విద్యార్థుల భవితవ్యాన్ని అంధకారంలోకి నెడుతున్న ముఖ్యమంత్రి, సంక్షేమ గురుకులాలను కూడా సమాధి చేసే పన్నాగం చేస్తే సహించే ప్రసక్తే లేదని కేటీఆర్ హెచ్చరించారు.బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలతోపాటు అగ్రవర్ణ పేదలకు కార్పొరేట్ స్థాయి విద్యనందించిన రెసిడెన్షియల్ వ్యవస్థను బలిపెడితే బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదని కేటీఆర్ స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి ఈ విషయం గుర్తుపెట్టుకుంటే మంచిదని ఘాటుగా వ్యాఖ్యానించారు. రెండేళ్ల నిండకుండానే రెండున్నర లక్షల కోట్ల అప్పులు తెచ్చిన రేవంత్ రెడ్డి, కనీసం గురుకులాల అద్దె కిరాయి కూడా కట్టకుండా, ఆ సొమ్ముతో ఎవరి జేబులు నింపుతున్నాడో తక్షణమే లెక్కలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. వెంటనే కాంగ్రెస్ సర్కారు రాష్ట్రంలోని అన్ని గురుకుల భవనాల అద్దె బకాయిలను విడుదల చేసి, విద్యార్థులు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని కేటీఆర్ కోరారు. ఒకవేళ గురుకులాలకు తాళాలు వేసే దుస్థితే వస్తే, రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి తెలంగాణ వ్యాప్తంగా ఈ నిరంకుశ కాంగ్రెస్ సర్కారుపై సమరశంఖం పూరిస్తామని కేటీఆర్ తీవ్ర హెచ్చరిక చేశారు. చిన్నారుల భవితవ్యంతో చెలగాటమాడుతున్న రేవంత్ రెడ్డికి ప్రజాక్షేత్రంలోనే గుణపాఠం చెబుతామని ఆయన స్పష్టం చేశారు.

## కాంగ్రెస్ అభ్యర్థిగా నవీన్ యాదవ్



- నవంబర్ 11న జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికకు కాంగ్రెస్ పార్టీ తమ అభ్యర్థిగా నవీన్ యాదవ్ పేరును ఖరారు చేసింది. దీనికి సంబంధించిన ఏఐసీసీ అధికారిక ప్రకటనను విడుదల చేసింది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక టిక్కెట్ కోసం అధికార పార్టీ నుంచి పలువురు ఆశావహులు పోటీ పడ్డారు. తెలంగాణ కాంగ్రెస్ నేతలు పార్టీ యువ నాయకుడు నవీన్ యాదవ్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, సీఎన్ రెడ్డి పేర్లను అధిష్ఠానానికి పంపించారు. మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ పేరు కూడా పరిశీలనలో ఉన్నప్పటికీ, ఆయన పోటీలో లేనని ఇప్పటికే స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో, అధిష్ఠానం వారి పేర్లను పరిశీలించి నవీన్ యాదవ్ పేరును ఖరారు చేసింది. జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నికల షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం నిన్న విడుదల చేసింది. నవంబర్ 11వ తేదీన పోలింగ్ జరగనుండగా, 14న ఓట్ల లెక్కింపు ఉంటుంది. సిట్టింగ్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణించడంతో జూబ్లీహిల్స్ ఉపఎన్నిక అనివార్యమైంది.

## ఇంటర్ గెస్ట్ లెక్చరర్ల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

- మాజీ మంత్రి హరీశ్ రావు



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్ గెస్ట్ లెక్చరర్ల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సీఎం రేవంత్ రెడ్డి సొంత జిల్లా వికారాబాద్ సహా రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్ గెస్ట్ లెక్చరర్లకు 9 నెలల పెండింగ్ వేతనాలు బాకీ పడ్డారని తెలిపారు. జీతాలు ఇవ్వక, ఉద్యోగాలు మానేసే పరిస్థితి వారికి కల్పించడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. నెలల తరబడి పెండింగ్‌లో పెడితే వారి కుటుంబ పోషణ ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకపోవడంతో కళాశాలకు వెళ్లకూడదని వారు నిర్ణయించుకున్నట్టు తెలిపారు. లెక్చరర్లు కాలేజీలకు రాకుంటే విద్యార్థులకు పాఠాలు ఎవరు చెబుతారు? సిలబస్ ను ఎవరు పూర్తి చేస్తారు? అని ప్రశ్నించారు. సర్కారు నిర్లక్ష్యంతో లెక్చరర్లతో పాటు విద్యార్థులు నష్టపోతున్నారని విమర్శించారు.

# గ్రూప్-1 పరీక్షలో భారీ అక్రమాలు




**బలగం టీవీ, హైదరాబాద్**

గ్రూప్-1 పరీక్షల్లో భారీ అక్రమాలు జరిగాయని, వెంటనే వాటిని రద్దు చేయాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు న్యాయం చేయాలని కోరుతూ తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్ గన్ పార్క్‌లోని అమరవీరుల స్థూపం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రూప్-1 అభ్యర్థులకు ధైర్యం ఇవ్వాలని ఈ ధర్నా నిర్వహించినట్టు తెలిపారు. గ్రూప్-1 పరీక్ష రద్దు చేయాలని జాగృతి ఆధ్వర్యంలో టీజీపీఎస్సీ కార్యాలయాన్ని ముట్టడించినా ఇంతవరకు ప్రభుత్వంలో ఎలాంటి చలనం లేదన్నారు. కాంగ్రెస్ నాయకులు, కుటుంబాలకు బోనస్ ఉద్యోగాలు ఇచ్చుకోండి కానీ బోగస్ ఉద్యోగాలు ఇవ్వొద్దని అన్నారు. రాహుల్ గాంధీ ఢిల్లీ నుంచి హైదరాబాద్ వచ్చి నిరుద్యోగుల కాళ్ళు పట్టుకుని ఓట్లు అడిగారని, ఆయన నేడు నిరుద్యోగులనే మోసం చేశారని ఆరోపించారు. ఇంత వరకు జాబ్ క్యాలెండర్ ఎందుకు విడుదల చేయలేదని ప్రశ్నించారు. పాత ఉద్యోగాలు ఇచ్చి, ఉద్యోగాలు తామే ఇచ్చామని గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. గ్రూప్-1 పరీక్ష రద్దయ్యేంత వరకు ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ విషయంలో తెలంగాణలోని మేధావులు మౌనం వీడాలని కోరారు. అవసరమైతే ప్రొ.హరగోపాల్‌ను కలిసి గ్రూప్-1 అభ్యర్థులకు న్యాయం జరిగేంత వరకు ఆయనతో కలిసి పోరాటం, రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహిస్తామన్నారు. నిరుద్యోగులను మోసం చేస్తున్నందుకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిరుద్యోగులే కూలగొడతారని హెచ్చరించారు. వెంటనే గ్రూప్-1 నియామకాలు రద్దు చేసి మళ్లీ పరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాలు పాటించాలని, ప్రెసిడెన్షియల్ ఆర్డర్ ద్వారా 8 మంది ఏపీ వారికి ఉద్యోగాలు ఇచ్చారని, ప్రెసిడెన్షియల్ ఆర్డర్‌పై తాము ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున జాగృతి కార్యకర్తలు, గ్రూప్-1 అభ్యర్థులు పాల్గొన్నారు.

# బాణాసంచా తయారీ కేంద్రంలో భారీ అగ్ని ప్రమాదం

- ఆరుగురు సజీవదహనం
- పలువురికి గాయాలు




**బలగం టీవీ, కోనసీమ**

ఏపీ అంబేద్కర్ కోనసీమ కోనసీమ జిల్లాలోని రాయవరంలో గణపతి గ్రాండ్ ఫైర్‌వర్క్స్‌లో బుధవారం మధ్యాహ్నం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ఆరుగురు కార్మికులు సజీవదహనం కాగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడినవారిని అనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పేలుడు సంభవించిన సమయంలో 40 మంది కార్మికులు విధుల్లో ఉన్నారని సమాచారం. పేలుడు తీవ్రతకు ఫ్యాక్టరీ గోడ కూలిపోవడంతో మరికొందరు శిథిలాల కింద చిక్కుకుని ఉండవచ్చని అధికారులు తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను ఆర్పేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. రామచంద్రపురం ఆర్డీవో అఖిల ఘటన స్థలాన్ని పరిశీలించారు.

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ ప్రమాదంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. “కోనసీమ జిల్లాలో జరిగిన బాణాసంచా తయారీ కేంద్రం అగ్నిప్రమాదం కలచివేసింది. పలు ప్రాణనష్టాలు జరగడం బాధాకరం,” అని పేర్కొన్నారు. “ప్రమాద కారణాలు, సహాయక చర్యలపై అధికారులతో చర్చించాను. ఉన్నతాధికారులు స్వయంగా సంఘటనా స్థలానికి వెళ్లి సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించాను. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలి. ప్రభుత్వం బాధిత కుటుంబాలకు అండగా ఉంటుంది,” అని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ కూడా ఈ ఘటనపై విచారం వ్యక్తం చేశారు. “కార్మికులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాను,” అని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఈ అగ్ని ప్రమాదం తనను కలిచివేసిందని అన్నారు. “ప్రభుత్వం బాధిత కుటుంబాలకు భరోసాగా ఉంటుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బాణాసంచా ఫ్యాక్టరీలు భద్రతా నిబంధనలు పాటిస్తున్నాయో లేదో అధికారులు నిర్ధారించాలి,” అని ఆదేశించారు.

# రసాయనశాస్త్రంలో ముగ్గురికి నోబెల్

**బలగం టీవీ, హైదరాబాద్**



రసాయన శాస్త్రంలో విశేష పరిశోధనలు జరిపిన ముగ్గురు శాస్త్రవేత్తలకు నోబెల్ బహుమతి లభించింది. మెటల్-ఆర్గానిక్ ఫ్రేమ్‌వర్క్స్ అభివృద్ధి చేసినందుకు గాను సుసుము కిటాగవా, రిచర్డ్ రాబ్సన్, ఒమర్ ఎం యాఘీలకు ఈ పురస్కారాన్ని అందించనున్నట్టు రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ వెల్లడించింది. వీరు కొత్తరకం మాలిక్యూలర్ ఆర్కిటెక్చర్‌ను అభివృద్ధి చేసినట్టు తెలిపింది. గతేడాది కూడా ముగ్గురికి ఈ అవార్డు దక్కింది. ప్రోటీన్లపై విశేష పరిశోధనలు చేసిన డేవిడ్ బేకర్, డెమిస్ హసాబిస్, జాన్ జంపర్‌లు ఈ పురస్కారం అందుకున్నారు. మొత్తంగా 1901-2024 మధ్యకాలంలో 116 సార్లు రసాయన శాస్త్రంలో నోబెల్‌ను ప్రకటించగా ఇప్పటివరకు 195 మంది దీనిని అందుకున్నారు. వీరిలో జాన్ బీ గూడ్‌ఎనఫ్ 97 ఏండ్ల వయసులో కెమిస్ట్రీలో పురస్కారం అందుకున్న వృద్ధుడిగా నిలువగా.. ఫ్రెడెరిక్ జొలియట్ 35ఏండ్ల వయసులో నోబెల్ అందుకున్న అతిపిన్న వయస్కుడిగా నిలిచారు. ఇక ఫ్రెడరిక్ సాంగెర్, బ్యారీ షార్ప్‌లెస్‌లు రసాయన శాస్త్రంలో రెండుసార్లు నోబెల్ అందుకోవడం విశేషం.

మరోవైపు సోమవారం (ఈనెల 6న) మొదలైన నోబెల్ పురస్కారాల ప్రకటన అక్టోబర్ 13 వరకు కొనసాగనుంది. తొలుత వైద్యశాస్త్రంలో, మంగళవారం భౌతికశాస్త్రంలో విజేతలను ప్రకటించారు. బుధవారం రసాయనశాస్త్రంలో నోబెల్ గ్రహీతల పేర్లు వెల్లడించారు. గురువారం సాహిత్యం, శుక్రవారం శాంతి బహుమతి, 13న అర్థశాస్త్రంలో ఈ పురస్కారం అందుకోనున్న వారి పేర్లను ప్రకటించనున్నారు. ఆల్‌ఫ్రెడ్ నోబెల్ వర్ధంతి రోజైన డిసెంబర్ 10న విజేతలకు అవార్డులను అందజేస్తారు.

# 12న 5 జిల్లాల్లో పల్స్ పోలియో వ్యాక్సినేషనల్ స్పెషల్ డ్రైవ్

**బలగం టీవీ, హైదరాబాద్**

ఈ నెల 12వ తేదీన రాష్ట్రంలోని ఆరు జిల్లాల్లో పల్స్ పోలియో వ్యాక్సినేషన్ స్పెషల్ డ్రైవ్ చేపట్టనున్నారు. మన రాష్ట్రంలో పోలియో చివరి కేసు 2007లో నమోదు అయింది. మన దేశంలో 2011లో చివరి కేసు నమోదు అయింది. గత 3 సంవత్సరాలుగా బంగ్లాదేశ్, పాకిస్తాన్ తదితర దేశాల్లో పోలియో కేసులు నమోదు అవుతున్నాయని కేంద్ర వైద్యారోగ్య శాఖ పేర్కొంది. ఈ నేపథ్యంలో.. ఆయా దేశాల నుంచి రాకపోకలు జరుగుతున్న దేశంలోని పలు జిల్లాల్లో పోలియో వ్యాక్సినేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని కేంద్ర ఆరోగ్యశాఖ నిర్ణయించింది. ఇందుకోసం దేశవ్యాప్తంగా 290 జిల్లాలను ఎంపిక చేయగా, అందులో మన రాష్ట్రం నుంచి 5 జిల్లాలు (హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి, హన్మకొండ) ఉన్నాయి. ఈ ఐదు జిల్లాలతోపాటు వరంగల్ జిల్లా పరిధిలోని పట్టణ ప్రాంతంలోనూ వ్యాక్సినేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని రాష్ట్ర ఆరోగ్యశాఖ నిర్ణయించింది. ఈ 5 జిల్లాల పరిధిలో 0-5 సంవత్సరాల వయసు పిల్లలు 17,56,789 మంది ఉన్నట్టు అధికారులు అంచనా వేశారు. వీరందరికీ ఈ నెల 12న స్పెషల్ డ్రైవ్‌లో పోలియో వ్యాక్సిన్ వేయనున్నారు. అప్పుడే పుట్టిన శిశువుల దగ్గర్నుంచి, 5 సంవత్సరాల వయ సున్న పిల్లలందరికీ వ్యాక్సిన్లు వేయించాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.

# స్థానిక ఎన్నికలపై స్టేకు నిరాకరణ

(మొదటి పేజీ తరువాయి)

రిజర్వేషన్లు ఇవ్వాలని కమిషన్ సిఫార్సు చేసిందన్నారు. ఈ వ్యవహారాలన్నింటిపైన అసెంబ్లీలో సమగ్రంగా చర్చించి, అన్ని రాజకీయ పార్టీల మద్దతుతో బిల్లుకు ఏకగ్రీవ ఆమోదం లభించిందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో జీవో 9ని, స్థానిక సంస్థల్లో బీసీలకు 25 శాతం నుంచి 42 శాతానికి రిజర్వేషన్లను పెంపు చేయడాన్ని అడ్డుకునేందుకు దాఖలైన పిటిషన్లలో స్టే ఆదేశాలు జారీ చేయాల్సిన అవసరం లేదన్నారు. కౌంటర్లు దాఖలు చేశాక సమగ్ర విచారణ పూర్తి చేశాక కోర్టు తగిన ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. బీసీలకు స్థానిక సంస్థల పదవుల్లో రిజర్వేషన్లు పెరిగితే, పాలనా పరంగానే కాకుండా విద్య, ఉద్యోగ, ఆర్థిక ప్రయోజనాలు కూడా లభిస్తాయని చెప్పారు.

ఈ సందర్భంగా న్యాయమూర్తులు బీసీ రిజర్వేషన్లపై ఏర్పాటు చేసిన వన్‌మ్యాన్ కమిటీ ఇచ్చిన నివేదికపై గెజిట్ ప్రచురించారా? బిల్లును గవర్నర్ ఆమోదించనప్పుడు దానిని ఆమోదించినట్లుగా పరిగణించారా? పరిగణిస్తే నోటిఫికేషన్ ఇచ్చారా? రాష్ట్రంలో బీసీల జనాభా ఒక్కో చోట ఒక్కోలా ఉంటుంది కదా.. అంతటా ఒకేలా 42 శాతం రిజర్వేషన్లు ఎలా ఇస్తారు.. వంటి ప్రశ్నలు ప్రభుత్వానికి వేశారు. ఇరుపక్షాల వాదనల అనంతరం ధర్మాసనం విచారణను వాయిదా వేసింది.

# నేడు తొలివిడత నోటిఫికేషన్

(మొదటి పేజీ తరువాయి)

రాజకీయ పార్టీలు ఈ పరిణామాల్ని ఆసక్తిగా గమనిస్తున్నాయి. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘం, ప్రభుత్వం న్యాయనిపుణులతో నిరంతరం చర్చలు జరుపుతున్నాయి. తీర్పు సానుకూలమైనా, వ్యతిరేకమైనా ఎన్నికల నిర్వహణను ఆపకూడదని ప్రభుత్వం భావిస్తున్నట్టు సమాచారం. అయితే మహారాష్ట్రలో మాదిరిగా ఫలితాలు వచ్చాక ఎన్నిక చెల్లదని కోర్టు తీర్పునిస్తే తమ పరిస్థితి ఏంటనే సందిగ్ధత పోటీచేసే అభ్యర్థుల్లో కనిపిస్తోంది.

# జిల్లాల్లో కేంద్ర బృందం పర్యటన

(మొదటి పేజీ తరువాయి)

కామారెడ్డిలో జీఆర్ కాలనీ వద్ద దెబ్బతిన్న బ్రిడ్జిని, కామారెడ్డి ఫిల్టర్ బెడ్ పంప్ హౌస్ క్యాజ్ వే రోడ్డును పరిశీలించారు. అనంతరం వరద నష్టంపై కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. ఈ సందర్భంగా జిల్లాలో జరిగిన నష్టాన్ని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జిల్లా వ్యాప్తంగా రహదారులు, వంతెనలు, పంటలు, ఇరి గేషన్ ట్యాంకులు, విద్యుత్ లైన్లు, స్తంభాలు, ఇండ్లు దెబ్బతిన్నాయని తెలిపారు. వాటిని తాత్కాలిక అత్య వసరంగా పునరుద్ధరణ చేపట్టామని వివరిం చారు. అనంతరం ఎల్లారెడ్డిలోని పెద్ద చెరువు కింద పంట పొలాలను పరిశీలించారు. నాగిరెడ్డిపేట్ మండలం లోని పోచారం డ్యామ్‌ను పరిశీలించారు. కాగా, పర్యటనకు వచ్చిన కేంద్ర బృందంలో.. హోమ్ అఫైర్స్ జాయింట్ సెక్రెటరీ పీకే రాయ్ నేతృత్వంలో ఎక్స్పెండిచర్స్ సెంట్రల్ ఫైనాన్స్ డిపార్ట్ మెంట్ డిప్యూటీ డైరెక్టర్ మహేష్ కుమార్, మినిస్ట్రీ ఆఫ్ జలశక్తి శ్రీనివాసు బైరి, నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్ఆర్ఎస్ఈ ) ఇస్రో డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పేస్ శశి వర్ధన్ రెడ్డి ఉన్నారు. వీరితో పాటు జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ విక్టర్, ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థసింహారెడ్డి, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ రవి తేజ, ఇరిగేషన్ సీఈ శ్రీనివాస్, ఆర్ అండ్ బీ ఈఈ మోహన్, జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రెడ్డి, కామారెడ్డి మున్సిపల్ కమిషనర్ రాజేందర్ రెడ్డి, విద్యుత్ శాఖ, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, ఆర్డబ్ల్యూఎస్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ముగ్గురు రైతులు ఆత్మహత్య చేసుకోవడం బాధాకరం

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**బలగం టీవీ, హైదరాబాద్**

తెలంగాణలో ఒకేరోజు ముగ్గురు రైతులు ఆత్మహత్య చేసుకోవడం అత్యంత బాధాకరమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విచారం వ్యక్తం చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం అచ్చన్నపేటలో మొగిలి లక్ష్మణ్(45), మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం నారాయణపురం పీక్లా తండాలో గూగులోత్ భాస్కర్(40), హన్మకొండ జిల్లా శాయంపేట మండల కేంద్రంలో నాలికె అనిల్(29).. ఈ ముగ్గురు రైతుల బలవన్మరణాలకు ముఖ్యమంత్రి రేవంతే పూర్తి బాధ్యుడని అన్నారు. సీఎం చేతకానితనంతో సృష్టించిన సాగునీటి సంక్షోభంతో బోర్లు వేసి బొక్కబోర్లా పడి ఒకరు ప్రాణాలు తీసుకుంటే.. పెట్టుబడి సాయం లేక ఆర్థిక భారంతో అప్పుల పాలై ఇంకొకరు బలయ్యారని కేటీఆర్ అన్నారు. భారీ వర్షాలతో నష్టపోయిన పంటకు పరిహారం అందక మరొక యువ రైతు కుటుంబాన్ని విషాదంలో ముంచి తనువు చాలించాడని తెలిపారు. ఇలా రేవంత్ సర్కార్ తెచ్చిన ఈ వ్యవసాయ సంక్షోభం నుంచి గట్టెక్కలేక అన్నదాతలు వరుసగా తమ నిండు ప్రాణాలు బలితీసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ పదేళ్ల ప్రస్థానంలో రైతుల ఆత్మహత్యలు 96 శాతం తగ్గాయని ఇటీవలే %చీజక్ష్మదీ% నివేదిక తేల్చిచెబితే.. మళ్లీ కాంగ్రెస్ పాలన రాగానే రైతు కుటుంబాల్లో ఈ మరణమృదంగం ప్రమాదఘంటికలు మోగిస్తోందని మండిపడ్డారు.సమైక్య రాష్ట్రంలో ఉన్నప్పుడు జరిగిన స్థాయిలో మరోసారి తెలంగాణ గడ్డపై రైతుల ఆత్మహత్యలు చోటు చేసుకోవడం విషాదమే కాదు.. ముంచుకొస్తున్న విలయానికి సంకేతమని కేటీఆర్ అన్నారు. రైతన్నలారా అధైర్యపడకండి అని ధైర్యం చెప్పారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో కేసీఆర్ సారథ్యంలో మళ్లీ వ్యవసాయాన్ని గాడిన పెట్టుకుందామని అప్పటి వరకు సంఘటితంగా పోరాడదామని పిలుపునిచ్చారు. రైతు వ్యతిరేక రేవంత్ సర్కారుకు బుద్ధి చెబుదామన్నారు.

## పోలీసు ఔదార్యం.. నిలిచిన యువకుడి ప్రాణం..

బలగం టీవీ, తంగళ్లపల్లి



రాజన్న సిరిసిల్ల జిల్లా, తంగళ్లపల్లి గ్రామానికి చెందిన వనం మహేష్ అనే యువకుడు మంగళవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించగా బ్లూ కోల్ట్ విధులలో వున్నా తంగళ్లపల్లి కానిస్టేబుల్ ప్రశాంత్ గౌడ్ సమయస్ఫూర్తితో స్పందించి అట్టి యువకుడిని సకాలంలో ఆసుపత్రి కి తీసుకెళ్లి ప్రాణాలు కాపాడాడు. సమయానికి ఆసుపత్రికి తీసుకు రావడం వలన ఎలాంటి ప్రమాదం లేదా లేదని వైద్యులు నిర్ధారించారు. పోలీస్ సిబ్బంది మరియు పలువురు అభినందించారు.



## వేములవాడ సర్కార్ దవాఖాన అరుదైన రికార్డ్..

- 24 గంటల్లో 20 ఆపరేషన్లు..
- వైద్యులకు సూపరింటెండెంట్ అభినందన

బలగం టీవీ, వేములవాడ

వేములవాడ సర్కార్ దవాఖాన మరోసారి అరుదైన రికార్డు సొంతం చేసుకుంది. దవాఖానలో 24 గంటల్లో 20 వివిధ రకాల ఆపరేషన్లు వైద్యులు విజయవంతంగా పూర్తి చేశారు. ఇందులో సాధారణ కాన్పులు 4, ఆపరేషన్ల ద్వారా 9, కంటి ఆపరేషన్లు 4, జనరల్ సర్జరీలు 2, ఒకటి ఆర్థో ఆపరేషన్ లు ఉన్నాయి. ఆపరేషన్లు చేసిన గైనకాలజిస్ట్ డాక్టర్లు సంధ్య, సోనీ, మాధవి, పిల్లల వైద్యులు సుభాషిణి, చారి, రమణ, ఆర్థోపెడిక్ డాక్టర్ అనిల్, మత్తు వైద్యులు రాజశ్రీ, తిరుపతి, రవీందర్, కంటి వైద్యులు డాక్టర్ రత్నమాల, నర్సింగ్ ఆఫీసర్స్ ఝాన్సీ, జ్యోతి, అనసూయ, భోసమ్ తో పాటు ఇందులో పాల్గొన్న ఇతర సిబ్బందిని ఆసుపత్రి పర్యవేక్షకుడు డాక్టర్ పెంచలయ్య అభినందించారు. పేద ప్రజలకు రానున్న రోజుల్లో మరిన్ని సేవలు అంకిత భావంతో అందించాలని తెలియజేశారు.



## బీజేపీలోకి భారీగా యువకులు..

బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఎల్లారెడ్డిపేట మండలం పరిధిలో పలు గ్రామాల నుంచి యువకులు పెద్ద సంఖ్యలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) లో చేరారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి ఈ యువకులను సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. బుధవారం రోజున ఎల్లారెడ్డిపేట మండలంలోని పలు గ్రామాల యువకులు జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నాల తిరుపతిరెడ్డి, మండల అధ్యక్షుడు రేపాక రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం నుంచి అల్లం నవీన్, లింబాద్రి ప్రవీణ్, నేవూరి శ్రీనివాస్ రెడ్డి, చందనం రామకృష్ణ, పెద్దవిని వెంకట్ సహా పలువురు యువకులు, అలాగే బుగ్గ రాజేశ్వర తండా గ్రామానికి చెందిన భాను, శ్రీధర్, అరవింద్, రాజేష్, భూక్య మహేష్, బానోతులక్ష్మి వంటి యువకులు బీజేపీ జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి సమక్షంలో పార్టీ కండువాలు కప్పుకున్నారు. సుమారు 100 మంది యువకులను ఈ సందర్భంగా పార్టీలోకి ఆహ్వానించడం జరిగింది.

ఈ సందర్భంగా రెడ్డబోయిన గోపి మాట్లాడుతూ యువతరం భారతీయ జనతా పార్టీ సిద్ధాంతానికి ఆకర్షితులయ్యారని, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు తమకు స్ఫూర్తిని ఇచ్చాయని అన్నారు. అంతేకాకుండా, గౌరవ పార్లమెంట్ సభ్యులు మరియు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ గారు పార్లమెంటు పరిధిలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు సైతం ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు. పార్టీలో చేరిన యువకులతో కలిసి అన్ని గ్రామాల్లోనూ పార్టీని కలిసికట్టుగా బలోపేతం చేద్దాం అని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ముద్దుల బుగ్గారెడ్డి, జిల్లా కౌన్సిల్ మెంబర్ చందుపట్ల లక్ష్మారెడ్డి, పట్టణ అధ్యక్షులు గంటా బాలకిషన్, నంది నరేష్, దాసరి గణేష్, చందుపట్ల రాజిరెడ్డి, రవీందర్ నాయక్, కృష్ణ హరి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వసతులు ఏర్పాటు చేయాలి

- గ్రేడ్ ఏ రకానికి రూ.2389
- కామన్ రకానికి రూ.2369
- అదనపు కలెక్టర్ గడ్డం నగేష్

బలగం టీవీ, రాజన్నసిరిసిల్ల



వరి ధాన్యం కొనుగోళ్లకు కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలని, రైతులకు ఇబ్బందులు కలుగకుండా ముందస్తుగా వసతులు కల్పించాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఖరీఫ్ సీజన్(2025-26) ధాన్యం కొనుగోళ్ల సన్నాహక సమావేశం వివిధ శాఖల అధికారులతో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా గడ్డం నగేష్ మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లో తప్పనిసరిగా షామియానా, తాగు నీరు, విద్యుత్ వసతి కల్పించాలని, టార్పాలిన్లు, ప్యాడీ క్లీనర్లు, తూకం వేసే యంత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. ధాన్యం తూకంలో పారదర్శకంగా ఉండాలని, నిర్దేశించిన విధంగా కొనుగోళ్లు చేయాలని అన్నారు. రైతులు తమ ధాన్యాన్ని తాలు, తప్ప లేకుండా, తేమ శాతం 17 ఉండేలా చూసుకుని కేంద్రాలకు తరలించాలని, అవసరమైన గన్ని బ్యాగులు సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం గ్రేడ్ ఏ రకం ధాన్యానికి క్వింటాలుకు రూ.2389, కామన్ రకానికి రూ.2369 నిర్ణయించిందని అన్నారు. ధాన్యం సేకరణలో కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు కీలకమని, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు వ్యవసాయ శాఖ అధికారులు నిర్ధారించిన ధాన్యానికి టోకెన్లు జారీ చేసి, రైతుల నుంచి సేకరించాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలకు కేటాయించిన రైస్ మిల్లులకు మాత్రమే ధాన్యం తరలించాలని, ట్యాబ్ ఎంట్రీలో రైతుల భూమి సర్వే నంబర్, ఎన్ని ఎకరాల్లో సాగు చేశారు. బ్యాంక్ ఖాతా వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేసి రైతుల బ్యాంకుల ఖాతాల్లో డబ్బులు పడేలా ఏర్పాట్లు చేయాలనిఅన్నారు. రైస్ మిల్లర్లు, ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్ ధాన్యం తరలింపు, దించుకోవడంలో ముందస్తుగా వసతులు కల్పించాలని సూచించారు.

**ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రారంభం..**

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని 13 మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. వ్యవసాయ శాఖ అంచనాల ప్రకారం జిల్లా లో ఈ సీజన్లో దాదాపు 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రానుందని,ధాన్యాన్ని సేకరించేందుకు పీఏసీఎస్ ఆధ్వర్యంలో 79, ఐకేపీ ఆధ్వర్యంలో 144, వివిధ శాఖల ఆధ్వర్యంలో 12 కేంద్రాలు, మొత్తం 231 ప్రారంభించనున్నట్లు తెలిపారు.

**అందుబాటులో పరికరాలు**

జిల్లాలో అవసరం మేరకు అన్ని పరికరాలు అందుబాటులో ఉన్నాయని అదనపు కలెక్టర్ వెల్లడించారు. టార్పాలిన్లు, తూకం వేసే యంత్రాలు, ప్యాడీ క్లీనర్లు, తేమ శాతం చూసే మెషిన్లు డిజిటల్ కాలిపర్స్, అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జిల్లాలోని రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

అనంతరం కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. గన్ని సంచులు, ధాన్యం తరలింపు, రైస్ మిల్లుల్లో ధాన్యం దించుకోవడంలో ఇబ్బందులు తొలగించాలని కోరారు. ఈ సమీక్షలో డీసీఎస్ఓ చంద్రప్రకాష్, జిల్లా మేనేజర్ రజిత డీపీఓ అఫ్జల్ బేగం, డీఆర్డీఓ శేషాద్రి, డీసీఓ రామకృష్ణ, డీఎంఓ ప్రకాష్, అదనపు డీఆర్డీఓ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల్లో మాదిగలను ఐక్యతతో గెలిపించుకోవాలి..



బలగం టీవీ, ఇల్లంతకుంట

ఇల్లంతకుంట మండల కేంద్రంలో మాదిగల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మాదిగల అలయ్- బలయ్ కార్యక్రమాన్ని స్థానిక శ్రీ రాజరాజేశ్వర ఫంక్షన్ హాల్లో ఘనంగా నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఉన్నటువంటి మాదిగ కులస్తులందరూ కలిసి ఒక తీర్మానాన్ని ఏర్పరచుకొని రానున్న స్థానిక సంస్థ ఎన్నికల్లో భాగంగా ఎక్కడైతే రిజర్వేషన్ కేటాయించినచో ఆ స్థానం నుంచి మాదిగ అభ్యర్థులను ఘనంగా గెలిపించుకోవాలని కోరారు. అంతేకాకుండా రాజ్యాంగం ఇచ్చినటువంటి ఓటు హక్కును ప్రతి ఒక్కరు వినియోగించుకొని కోరారు.

ఈ సందర్భంగా సావనపెల్లి రాకేష్ మాట్లాడుతూ.. మండలంలోని ఏఏ గ్రామాల్లో ఎస్సీ రిజర్వేషన్ కేటాయించినటువంటి ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాల్లో మాదిలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి అత్యధిక మెజార్టీతో గెలిపించుకొని మాదిగల యొక్క సత్తా స్థానిక సంస్థ ఎన్నికల్లో నిరూపించాలని ఇట్టి కార్యక్రమాన్ని ఉద్దేశించి తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, అన్ని గ్రామాల మాదిగ కుల బాంధవులందరూ పాల్గొన్నారు.

## దుబాయ్ లో వాల్గొండ వాసి మృతి

బలగం టీవీ, వాల్గొండ

మల్లాపూర్ మండలంలోని వాల్గొండ ఎస్టీ తండ గ్రామానికి చెందిన లకావత్ రమేష్ (40) అనే వ్యక్తి దుబాయ్లో మృతి చెందినట్లు స్థానికులు, బంధువులు తెలిపారు. రమేష్ గత కొంత కాలంగా జీవనోపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లి అక్కడ కార్మికుడిగా పనిచేస్తున్నాడు.




## మానసిక ఆరోగ్యాన్ని సంరక్షించుకోవడం హక్కు మాత్రమే కాదు, బాధ్యత కూడా..

**జిల్లా న్యాయ సేవాధికర సంస్థ కార్యదర్శి రాధిక జైస్వాల్**

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల

మనిషి మానసిక ఆరోగ్యాన్ని సంరక్షించుకోవడం తన హక్కు మాత్రమే కాదు, బాధ్యత కూడా అని జిల్లా న్యాయ సేవాధికర సంస్థ కార్యదర్శి (సీనియర్ సివిల్ జడ్జి) రాధిక జైస్వాల్ అన్నారు. బుధవారం ఎల్లారెడ్డిపేట్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో "ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని" పురస్కరించుకొని న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డా.ప్రవీణ్, ఎస్సై రాహుల్ రెడ్డి, లోక్ అదాలత్ సభ్యులు చింతోజు భాస్కర్, కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి మరియు కళాశాల అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



## క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు నగదు బహుమతి అందజేత..

- బతుకమ్మ ఘాట్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్..

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల

బతుకమ్మ ఘాట్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ విజయవంతంగా ముగిసింది. ఈ టోర్నమెంట్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, 'బి.వై. నగర్? నరేష్ టీం' విజేతగా నిలిచింది. విజేత జట్టుకు ట్రోఫీతో పాటు ప్రైజ్ మనీని అందజేసే కార్యక్రమానికి షణ్ముఖ నిధి ఫైనాన్స్ లిమిటెడ్ డైరెక్టర్ అయిన గోక శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన చేతుల మీదుగా విజేత 'బి.వై. నగర్? నరేష్ టీం' సభ్యులకు బహుమతిని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా గోక శ్రీనివాస్ మాట్లాడుతూ.. క్రీడలు మానసిక, శారీరక ఆరోగ్యానికి ఎంతగానో దోహదపడతాయని, యువత క్రీడల్లో చురుగ్గా పాల్గొనాలని సూచించారు. విజేత జట్టును, టోర్నమెంట్ నిర్వహించిన బతుకమ్మ ఘాట్ స్పోర్ట్స్ క్లబ్ను ఆయన అభినందించారు. ఈ టోర్నమెంట్ నిర్వహణకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన ప్రతి ఒక్కరికి బతుకమ్మ ఘాట్ స్పోర్ట్స్ క్లబ్ నిర్వాహకులు ఈ సందర్భంగా తమ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

# జడేజా, సిరాజ్‌లకు అత్యుత్తమ ర్యాంకులు






**● అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ టెస్టు ర్యాంకింగ్స్ రిలీజ్**

**బలగం టీవీ, హైదరాబాద్**

టీమ్‌ఇండియా స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా, పేసర్ మహ్మద్ సిరాజ్ క్రికెట్ రాంకింగ్స్ లో కెరీర్? బెస్ట్ పొజిషన్ సాధించారు. అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ తాజాగా రిలీజ్ చేసిన టెస్టు ర్యాంకింగ్స్?లో జడేజా, సిరాజ్ అత్యుత్తమ ర్యాంకులు సంపాదించారు. జడేజా రీసెంట్‌గా వెస్టిండీస్‌పై తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీతో అదరగొట్టాడు. ఈ ఇన్నింగ్స్‌లో జడ్డూ 104 పరుగులతో అజేయంగా నిలిచాడు. ఫలితంగా తాజా ర్యాంకింగ్స్‌లో ఆరు స్థానాలు ఎగబాకి కెరీర్?లో ఆల్?టైమ్ బెస్ట్ పొజిషన్‌కు చేరుకున్నాడు. ప్రస్తుతం జడ్డూ 644 రేటింగ్స్?తో 25వ స్థానంలో కొనసాగుతున్నాడు. జడేజాకు టెస్టు బ్యాటింగ్ ర్యాంకింగ్స్?లో ఇదే అత్యుత్తమ ర్యాంక్.మరోవైపు, కొంతకాలంగా టెస్టుల్లో నిలకడగా రాణిస్తున్న సిరాజ్ విండీస్?తో తొలి మ్యాచ్?లోనూ రెండు ఇన్నింగ్స్?ల్లో 7 వికెట్లు పడగొట్టి సత్తా చాటాడు. దీంతో సిరాజ్ మూడు స్థానాలు మెరుగుపర్చుకున్నాడు. అతడు ప్రస్తుతం 718 రేటింగ్స్?తో 12వ స్థానానికి చేరుకున్నాడు. కాగా, సిరీజ్ కెరీర్?లో ఇదే అత్యుత్తమ పొజిషన్ కావడం విశేషం. కాగా, బ్యాటింగ్ విభాగంలో ఇంగ్లాండ్ సీనియర్ బ్యాటర్ జో రూట్ టాప్?లో ఉన్నాడు. ఆ తర్వాత పొజిషన్?లో కూడా ఇంగ్లాండ్ బ్యాటర్ హ్యారీ బ్రూక్ కొనసాగుతున్నాడు. టీమ్‌ఇండియా బ్యాటర్ యశస్వీ జైస్వాల్ తాజా ర్యాంకింగ్స్?లో రెండు స్థానాలు దిగజారాడు. ప్రస్తుతం అతడు 7వ (779 రేటింగ్స్) స్థానంలో ఉండగా, రిషభ్ పంత్ (761 రేటింగ్స్) ఎనిమిదో ప్లేస్?లో కొనసాగుతున్నాడు. టీమ్‌ఇండియా టెస్టు కెప్టెన్ శుభ్?మన్ గిల్ ప్రస్తుతం 722 రేటింగ్స్?తో 13వ స్థానంలో ఉన్నాడు. ఇక బౌలింగ్ విభాగంలో టీమ్‌ఇండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా టాప్?లోనే కొనసాగుతున్నాడు. అతడు 885 రేటింగ్స్?తో అగ్రస్థానంలో ఉండగా, కగిసో రబాడ 851 రేటింగ్స్?తో రెండో ప్లేస్?లో ఉన్నాడు. టీమ్‌ఇండియా నుంచి టాప్ 10 లో బుమ్రా తప్పా ఇంకో బౌలర్ లేడు. టాప్ 20లో బుమ్రా సహా సిరాజ్ (12), రవీంద్ర జడేజా (669 రేటింగ్స్) 17వ స్థానంలో ఉన్నాడు. ఆల్?రౌండర్ల విభాగంలో రవీంద్ర జడేజానే టాప్?లో కొనసాగుతున్నాడు. జడ్డూ 430 రేటింగ్స్?తో అగ్రస్థానంలో ఉన్నాడు. బంగ్లాదేశ్ ప్లేయర్ మెహెదీ హసన్ మిరాజ్ 305 రేటింగ్స్?తో రెండో ప్లేస్?లో ఉన్నాడు. స్పిన్నర్ వాషింగ్టర్ సుందర్ మాత్రం నాలుగు స్థానాలు మెరుగుపర్చుకున్నాడు. అతడు 205 రేటింగ్స్?తో ప్రస్తుతం 11వ స్థానంలో కొనసాగుతున్నాడు. సుందర్ తప్పా ఆల్?రౌండర్ల ర్యాంకింగ్స్?లో పెద్దగా మార్పులు లేవు.

# మాస్ జాతర నుంచి మరో పాట


**● ఓలేఓలే పాటపై విమర్శలను తిప్పికొట్టిన రవితేజ**

**బలగం టీవీ, హైదరాబాద్**




రవితేజ హీరోగా శ్రీలీల హీరోయిన్‌గా కొత్త దర్శకుడు భాను భోగవరపు తెరకెక్కించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'మాస్ జాతర'. అక్టోబర్ 31న రిలీజ్ కానుంది. ఈనేపథ్యంలో 'హుడియో హుడియో' పాటను విడుదల చేయనున్నారు. చిట్టి చిలకా.. చిన్న మొలకా..అంటూ సాగే లిరిక్స్‌ను దేవ్ రాయగా అబ్దుల్ వహాబ్, భీమ్స్ సిసిరోలియో ఆలపించారు. ఇటీవల ఇందులోని 'ఓలే ఓలే' లిరికల్ సాంగ్‌ను రిలీజ్ చేసిన విషయం తెలిసిందే. అయితే, ఈ పాట లిరిక్స్‌లో అసభ్య పదాలు ఉన్నాయిని విమర్శలు వచ్చాయి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో రవితేజ, దర్శకుడు ఈ విమర్శలపై స్పందించారు. కొన్నిటిపై బోల్డ్ మూవీలు అనే ముద్ర వేస్తారు. అలాంటి వాటితో ఎవరికీ ఇబ్బంది రాదు. కానీ, వారికి నా సినిమాతో మాత్రమే సమస్య వచ్చింది. మా గ్రామాల్లో స్థానికంగా జరిగే ఉత్సవాల్లో కొంతమంది చిన్న చిన్న కథలను పాటలుగా చెబుతుంటారు. వాళ్లు తిట్టుకున్నట్లు అనిపిస్తుంది కానీ, వాస్తవానికి వాళ్లు చాలా ప్రేమగా మాట్లాడుకుంటారని దర్శకుడు భాను అన్నారు. విమర్శలు చేసేవారు కేవలం పాటలోని కొన్ని పదాలను మాత్రమే చూస్తున్నారు. తర్వాత వచ్చే సరదా సంభాషణలను చూడడం లేదు. సినిమా చూశాక ఈ పాట వెనక ఉన్న అసలు కథ మీకు అర్థమవుతుంది. ప్రేక్షకులకు అందరికీ ఈ పాట నచ్చుతుంది. అయినా ఇప్పుడు ఇంగ్లిష్‌లో కొన్ని పదాలు సాధారణం అయిపోయాయి. వాటిని తెలుగులో చెప్పినప్పుడే కొందరికి సమస్య వస్తుందని రవితేజ చెప్పారు. ఇక ఈ పాట సినిమాలో సన్నివేశానికి సరిగ్గా సరిపోతుందని శ్రీలీల అన్నారు.

# ఓటిటిలోకి వార్-2 ఎంటర్




**బలగం టీవీ, హైదరాబాద్**

బాలీవుడ్ నటుడు హృతిక్ రోషన్, టాలీవుడ్ స్టార్ నటుడు ఎన్టీఆర్ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం వార్. కియారా అద్వానీ ఈ సినిమాలో కథానాయికగా నటించగా.. అనిల్ కపూర్, అశుతోష్ రాణా, అలియాభట్, బాబీ దేవోల్, శర్వారీ వాఘ్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. ఈ సినిమాకు అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహించగా.. యష్‌రాజ్ ఫిలిమ్స్ బ్యానర్‌పై ఆదిత్య చోప్రా నిర్మించాడు. ఈ చిత్రం ఇండెపెండెన్స్ కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చి మిక్స్‌డ్ టాక్ తెచ్చుకున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ సినిమా ఓటీటీలోకి రాబోతుంది. ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్‌లో ఈ చిత్రం అక్టోబర్ 9 నుంచి స్ట్రీమింగ్ కాబోతున్నట్లు ప్రకటించింది. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. ఇండియన్ రా ఏజెన్సీలో ప్రముఖుడైన ఏజెంట్ కబీర్(హృతిక్) కిరాయి హంతకుడిగా మారి హత్యలు చేస్తుంటాడు. ఇదిలావుంటే.. చైనా, రష్యా, శ్రీలంక, మయన్మార్, బంగ్లాదేశ్ దేశాలన్నీ ఒక కోటరీగా మారి, 'కలి' పేరుతో ఇండియా పతానానికి ఎక్స్‌-లాన్ చేస్తాయి. ఈ మిషన్‌ని కబీర్‌కు అప్పజెబుతాయి. కబీర్‌ను అడ్డుకునేందుకు విక్రమ్ చలపతి (జూనియర్ ఎన్టీఆర్) రంగంలోకి దిగుతాడు. అసలు కబీర్‌కీ, విక్రమ్‌కు మధ్య ఉన్న బంధం ఏంటి? 'కలి' వల్ల భారత ప్రధానికి పొంచివున్న ముప్పును వీరిద్దరూ ఎలా ఆపారు? ఈ మిషన్‌లో వింగ్ కమాండర్ కావ్య లూత్ర(కియారా అద్వానీ) పాత్ర ఏంటి? ఈ ప్రశ్నలకు సమాధానమే మిగతా కథ.

## లోక సినిమాతో హిట్ సాధించిన కళ్యాణి

**బలగం టీవీ, హైదరాబాద్**



లోక సినిమాతో రూటు మార్చేసింది కళ్యాణి ప్రియదర్శన్. ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద బిగ్గెస్ట్ హిట్‌గా నిలువడమే కాదు.. నిర్మాతలకు కాసుల వర్షం కురిపించింది. అత్యధిక గ్రాస్ సాధించిన సౌతిండియన్ ఫీ మేల్ సెంట్రిక్ మూవీగా నిలిచింది. మాలీవుడ్ లో గత రికార్డులు బీట్ చేసి టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలిచింది. కళ్యాణి ప్రియదర్శన్ మళ్లీ గ్లామరస్ అవతార్‌లోకి మారిపోయింది. ఎవరూ ఊహించని విధంగా సూపర్ గ్లామర్ రోల్‌లో దర్శనిమిచ్చింది కళ్యాణి ప్రియదర్శన్. ఈ భామ కమర్షియల్ సినిమా హీరోయిన్‌గా ట్రాన్స్‌ఫార్మేషన్ అయిన తీరుకు షాక్ అవుతున్న ఫాలోవర్లు, నెటిజన్లు.. ఈ సాంగ్‌లో వేసిన స్టెప్పులకు ఫిదా అవుతున్నారు.గ్లామరస్ పాత్ర గురించి కళ్యాణి ప్రియదర్శన్ మాట్లాడుతూ.. ఓ యాక్టర్‌గా నేను ఇదివరకెన్నడూ చేయని పాత్రలను చేయాలని నాకు నేను చాలెంజింగ్‌గా తీసుకుంటా. ఈ పాటలో అలాంటి కొన్ని మూమెంట్స్ ఉన్నాయి. నా డైరెక్టర్ భువనేశ్ ఈ విషయం గురించి నాకు చెప్పినప్పుడు.. అతడు ఉ।నితి। కథకు చాలా ముఖ్యమైన అందమైన కమర్షియల్ మ్యూజికల్ పీస్‌ను అద్భుతంగా ఎలా తీశాడోనని అనిపించింది. దీనివెనుకున్న కారణాలు చాలా శక్తివంతమైనవి. ఏదైనా కొత్తగా చేయాలని.. చాలా బాగా కష్టపడటం జరిగింది. మీరంతా ఈ పాటను ఇష్టపడతారని ఆశిస్తున్నానని చెప్పుకొచ్చింది.

# 2027 వరల్డ్ కప్ ఆడటమే నా లక్ష్యం

**● హిట్ మ్యాన్ రోహిత్ శర్మ కీలక వ్యాఖ్యలు**

**బలగం టీవీ, హైదరాబాద్**




ఆస్ట్రేలియా వన్డే సీరీస్ కు ఫిట్ నెస్ నిరూపించుకున్నాడు రోహిత్ శర్మ. కఠినమైన టెస్ట్ ను పాస్ అయ్యాడు. దానికి ముందు కూడా సీనియర్ క్రికెటర్లు ఇద్దరూ భారత జట్టులో ఉంటారా లేదా అనుమానాలు చెలరేగాయి. అయితే ఏ సందర్భంలోనూ రోహిత్ శర్మ స్పందించాలేదు. ఆస్ట్రేలియా టూర్ కు వన్డే జట్టును ప్రకటించిన తర్వాత కూడా హిట్ మ్యాన్ ఏమీ మాట్లాడలేదు. కానీ సియట్ అవార్డు ల ఫంక్షన్ లో రోహిత్ శర్మ మొట్టమొదటి సారిగా ఈ విషయంపై స్పందించాడు. తనకు అన్నింటి కంటే క్రికెట్ ఆడడం ముఖ్యమని చెప్పాడు. వచ్చే వన్డే వరల్డ్ కప్ వరకు జట్టులో కొనసాగడమే లక్ష్యమని మరోసారి గట్టిగా తెలిపాడు. సీనియర్ క్రికెటర్ గా జట్టుతో కలిపి మంచి ఫలితాలను అందించడంపైనే దబుష్టి పెడతానని అన్నాడు. ఆస్ట్రేలియా జట్టుతో ఢీకొనడాన్ని తానెప్పుడూ ఆస్వాదిస్తానని రోహిత్ చెప్పుకొచ్చాడు. ఆ జట్టుతో క్రికెట్ ఆడడం సవాల్ తో కూడుకున్నది..అక్కడ ప్రజలు కూడా ఆటను ఇష్టపడతారు. టీమ్ ఇండియా, ఆస్ట్రేలియాల మ్యాచ్ జరుగుతుందంటే...అది వేరే లెవల్ ఉంటుంది ఎప్పుడూ. కాబట్టి తమ జట్టు ఏం చేయాలో, తాను ఎలా ఆడాలో ప్రణాళికలు వేసుకుంటున్నానని రోహిత్ చెప్పాడు. కెప్టెన్సీ అనేది తనకు అంత ఇంపార్టెంట్ కాదని ఇండైరెక్ట్ గా తెలిపాడు. టెస్ట్, టీ20 లకు గుడ్ బై చెప్పినా వన్డేల్లో కొనసాగి..తదుపరి వరల్డ్ కప్ ను కొట్టడమే లక్ష్యమని మరోసారి చాలా బలంగా తెలిపాడు హిట్ మ్యాన్.మరోవైపు రోహిత్ శర్మను కెప్టెన్సీ నుంచి తొలగించడంపై బీసీసీఐ కూడా క్లారిటీ ఇచ్చింది. అన్ని ఫార్మాట్లలోనూ ఒకడే కెప్టెన్ ఉండాలన్న ఉద్దేశంతోనే శుభ్ మన్ గిల్ ను కెప్టెన్ గా ఉంచామని చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ అన్నారు. దాంతో పాటూ 2027 వరల్డ్ కప్ ను దృష్టిలో ఉంచుకుని కూడా తాము గిల్ కు అవకాశం ఇచ్చామని చెప్పారు. ఇప్పటి నుంచి అతను కెప్టెన్సీ చేస్తే అప్పటికీ అనుభవం వస్తుందని తెలిపారు. వరల్డ్ కప్ ఆడడానికి రెండు ఏళ్ళు ఉన్నట్టు కనిపిస్తున్నా మధ్యలో భారత జట్టు వన్డేలు ఆడేది ఎక్కువగా లేదని అగార్కర్ స్పష్టం చేశారు. మూడు ఫార్మాట్లకు ముగ్గురు వేర్వేరు కెప్టెన్లను కలిగి ఉంటే చాలా కష్టం. సెలెక్టర్ల పరంగానే కాదు.. కోచ్‌కి కూడా ఇదికష్టమేనని వివరించారు. ముగ్గురు వేర్వేరు వ్యక్తులతో ప్రణాళికలు వేయడం ఎప్పుడూ సులభం కాదని అజిత్ అగార్కర్ తెలిపారు.



## మళ్లీ అవకాశాలు పట్టుకుంటున్న పూజా

**బలగం టీవీ, హైదరాబాద్**

ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలో ఉన్న మోస్ట్ టాలెంటెడ్ భామల్లో టాప్‌లో ఉంటుంది పూజా హెగ్డే. తమిళం, హిందీ, తెలుగు భాషల్లో టాప్ స్టార్లతో కలిసి నటించి వన్ ఆఫ్ ది లీడింగ్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగింది. ఈ పొడుగు కాళ్ల సుందరికి తెలుగులో హిట్ పడక చాలా కాలమే అవుతుంది. తెలుగులో కూడా బ్యాక్ టు బ్యాక్ హిట్స్ అందుకుంటున్న మాలీవుడ్ స్టార్ యాక్టర్ దుల్కర్ సల్మాన్. ఈ లీడింగ్ హీరో రవి నెలకుడిటి దర్శకత్వంలో ఓ తెలుగు సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడని తెలిసిందే. ప్రస్తుతం హైదరాబాద్‌లో జెట్ స్పీడ్‌లో షుటింగ్ కొనసాగుతోంది. ఈ సినిమాతో లాంగ్ గ్యాప్ తర్వాత పూజా హెగ్డే మళ్లీ తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. తాజా కథనాల ప్రకారం ఈ సినిమా కోసం పూజా హెగ్డే ఏకంగా రూ.3 కోట్లు పారితోషికం తీసుకుం టుందని టాక్. అయితే రెమ్యునరేషన్ భారీగా డిమాండ్ చేస్తున్న కారణంగా పూజాహెగ్డే తెలుగు సినిమాలకు దూరమైందని కొన్ని రోజుల క్రితం వార్తలు చక్కర్లు కొట్టాయి. కానీ దుల్కర్ సల్మాన్ టీంకు ఈ విషయంలో ఎలాంటి అభ్యంతరాలు లేకపోవడంతో పూజా హెగ్డేను తమ టీంలోకి తీసుకుందట. ఇక ఈ పుకార్లకు ఫుల్ స్టాప్ పెడుతూ తెలుగులో దుల్కర్ సల్మాన్ సినిమాతో మళ్లీ ఫాంలోకి రావాలని చూస్తున్నట్టు అర్థమవుతుంది. ఇటీవలే రజినీకాంత్ నటించిన కూలీ సినిమాలో మోనికా సాంగ్‌లో మెరిసింది పూజా హెగ్డే. ఈ పాటలో అందాలు ఆరబోస్తూ కుర్రకారుకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. కూలీ సాంగ్ భారీ హిట్ అయింది. ఇక దుల్కర్ సల్మాన్ సినిమా బ్లాక్ బస్టర్ అయితే పూజాహెగ్డేకు తెలుగులో మళ్లీ మంచి రోజులు వచ్చినట్టేనని చెప్పొచ్చు.

## "మా సినిమాలకు తమిళనాడులో స్క్రీన్లు దొరకవు!"

**బలగం టీవీ, హైదరాబాద్**

యువ నటుడు కిరణ్ అబ్బవరం కే ర్యాంప్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్‌లో పాల్గొన్న కిరణ్, చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. "నాన్-తెలుగు హీరోల సినిమాలు మన రాష్ట్రాల్లో గ్రాండ్‌గా విడుదల అవుతుంటాయి. కానీ తెలుగు యాక్టర్లు ఇతర ప్రాంతాల్లో సినిమాలు రిలీజ్ చేయాలంటే చాలా కష్టాలు పడాలి," అని పేర్కొన్నాడు. గత ఏడాది దీపావళికి విడుదలైన తన 'కా' చిత్రం మంచి టాక్ తెచ్చుకున్నప్పటికీ, తమిళనాడులో డబ్బింగ్ వెర్షన్ విడుదల కాలేదని చెప్పుకొచ్చాడు. "తమిళనాడులో మా సినిమాకి స్క్రీన్లు దొరకవని చెప్పారు. మొదటి వారం తెలుగు వెర్షన్‌కే సరైన స్క్రీన్లు లేవు. ఆ తర్వాత డిమాండ్ పెరిగినా, కేవలం 10 స్క్రీన్లు మాత్రమే ఇచ్చారు," అని అన్నారు. "మలయాళం నుండి వచ్చిన 'లోక చాప్టర్' వంటి సినిమాలు తెలుగులో హౌస్‌ఫుల్ షోలతో ఆడుతున్నాయి. కానీ తెలుగు నుండి యంగ్ యాక్టర్స్ ఏదైనా కొత్తగా చేస్తే, ఇతర రాష్ట్రాల్లో థియేటర్లు ఇవ్వరు," అని వ్యాఖ్యానించారు. ఇక తమిళ నటుడు ప్రదీప్ రంగనాథన్ నటించిన 'డ్యూడ్' ఈ దీపావళికి తెలుగులో రిలీజ్ అవుతుందని, దానికి మంచి స్క్రీన్లు లభించాయని చెప్పారు.'తమిళనాడులో తెలుగు సినిమాకి ఉన్నంత ప్రేమ నాకు దొరకదు. మేము తమిళ స్టార్లను ప్రేమిస్తాం, సపోర్ట్ ఇస్తాం. దానికి ప్రతిఫలంగా అదే ప్రేమ మాకు రావాలని మాత్రమే కోరుకుంటున్నా," అని కిరణ్ అబ్బవరం చెప్పారు.